సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 17 । అక్టోబర్ । 2022



46 కేజీల గంజాయితో 14 మంది అరెస్టు
- బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

8లో



దిగుబడి బాగు.. అమ్మకాలు జోరు
- ఆర్థికంగా ఆదుకొన్న వేరుశనగ పంట
- వారపు సంతల్లో విక్రయాలు

8లో

పిడుగుపాటు ప్రభావంతో నిలిచిన తపాలా సేవలు

కొయ్యూరు: కొద్ది రోజుల కిందట పిడుగుపడి రాజేంద్రపాలెం తపాలా శాఖ బ్రాంచిలో ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతినడంతో సేవలు నిలిచిపోయాయి. వివిధ పనుల కోసం ఎక్కువ మంది ఇక్కడికి వస్తుంటారు. సేవలకు అంతరాయం ఏర్పడుతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమ, మంగళవారాల్లో సేవలు పునరుద్ధరించే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు.

న్యూస్‌రీల్

జనసేనకు రాజకీయ పార్టీ లక్షణాలు లేవు

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: జనసేనకు రాజకీయ పార్టీ లక్షణాలేవీ లేవని, రౌడీల పార్టీలా తయారైందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. మంత్రులపై జరిగిన దాడిని ఖండించకపోగా పవన్‌కళ్యాణ్ ప్రెస్‌మీట్ పెట్టి నీతి వాక్యాలు వల్లించడం సిగ్గుచేటన్నారు. జనసేన తెలుగుదేశానికి తోక పార్టీలా తయారైందని చెప్పారు. ఎన్నికల్లో రాష్ట్రంలో ఘోరంగా విఫలమైన జనసేన హింసను ప్రేరేపించి లబ్ధి పొందాలని చూస్తోందని చెప్పారు. మంత్రులపై చేసిన దాడికి జనసేన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. చంద్రబాబు ఆడించినట్టు ఆడటమే పవన్ కళ్యాణ్‌కు ఏకైక ఎజెండాగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన పవన్ కళ్యాణ్ ఉత్తరాంధ్రపై కక్ష తీర్చుకునేందుకే ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని అన్నారు.

విజ్ఞాన యాత్రకు మిరియాల రైతులు



జెండా ఊపి విజ్ఞాన యాత్రను ప్రారంభిస్తున్న జేసీ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: విజ్ఞాన యాత్రను కాఫీ, మిరియాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ తెలిపారు. ఏజెన్సీలో మిరియాలు సాగుచేస్తున్న గిరిజన రైతులకు కేంద్ర ప్రభుత్వం, స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన యాత్రను ఆదివారం జేసీ ప్రారంభించారు. స్థానిక తలారిసింగిలో విజ్ఞాన యాత్ర బస్సును జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడేరు మండలం మోదాపల్లి, అరకులోయ మండలం చినలబుడు గ్రామాల నుంచి సుమారు 32 మంది రైతులు కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ సికిలేస్ పూర్, మరికేరి ప్రాంతాల్లోని కాఫీ, సుగంధ ద్రవ్యాల సాగును సందర్శిస్తారని తెలిపారు. విజ్ఞాన యాత్ర ద్వారా కాఫీ, సుగంధ ద్రవ్యాలతో పాటు మిరియాల సాగులో మెలకువలు, ఇతర అంశాలపై అవగాహన పెంచుకుంటారన్నారు. ఈ నెల 24 వరకు కర్ణాటకలో పర్యటించి విజ్ఞాన యాత్ర ముగించుకుని తిరిగి వస్తారని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పైసెస్‌బోర్డు ఫీల్డ్ అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దామోదర ఉత్సవాలు

కొమ్మాది(భీమిలి): సాగర్‌నగర్ ఇస్కాన్‌లో కార్తీక దామోదర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వచ్చే నెల 8 వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం నాలుగున్నర గంటల నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఆదివారం రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళహారతి, నరసింహ హారతి, తులసి హారతి, భగవంతుని నేతి దీప సమర్పణ, గజేంద్రుని స్తుతి, దామోదర అష్టకం, గోపి గీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిక్షాష్టకం పారాయణం నిర్వహించారు.

ముంబయి, విదర్భ జట్ల విజయం

ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిన తరణమ్

విశాఖ స్పోర్ట్స్: సీనియర్ వుమెన్ టీ–20 ట్రోఫీలో భాగంగా ఆదివారం విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 66 పరుగుల తేడాతో బరోడాపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో పుదుచ్చేరిపై 14 పరుగుల తేడాతో విదర్భ గెలుపొందింది. మొదటి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఏడు వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. వికెట్ కీపర్ ఆర్ఎస్ చౌదరి 47 పరుగులు చేయగా కాజీ 57 పరుగులు చేసింది. సాయాలీ 26 పరుగుల వద్ద రనౌటైంది. తరణమ్ మూడు వికెట్లు తీసింది. ప్రతిగా బరోడా జట్టు 95 పరుగులకు ఆలౌటైంది. తరణమ్ బ్యాటింగ్‌లోనూ రాణించి 22 పరుగులు చేయగా సిజే దేశయ్ 22 పరుగుల వద్ద లెగ్‌బిఫోర్‌గా వెనుతిరిగింది. కెప్టెన్ భాటియా 12 పరుగులు చేయగా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఓపెనర్ ప్రజ్ఞా డకౌట్ కాగా టైలెండర్ రిధి డకౌట్‌గానే వెనుదిరగడంతో ఇన్నింగ్స్ ముగిసింది. జాహ్నవి మూడు వికెట్లు తీయగా దాక్షిణి, ఫాతిమా రెండేసి వికెట్లు తీశారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ జట్టు ఏడు వికెట్లకు 129 పరుగులు చేసింది. కెప్టెన్ కసత్(60) అర్ధసెంచరీ నమోదు చేసింది. హీనా నలుగురిని పెవిలియనుకు పంపింది. ప్రతిగా పుదుచ్చేరి జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 115 పరుగులే చేసింది.

నిరసనల సెగ!

- మంత్రులపై దాడులకు తెగబడ్డ జనసేన శ్రేణులు
- ఆగ్రహోదగ్రులైన వైఎస్సార్‌సీపీ నాయకులు
- విశాఖలో ఆందోళనలు.. మానవహారాలు
- హోటల్ గదికే పరిమితమైన పవన్ కల్యాణ్
- విధి లేక జనవాణి కార్యక్రమం వాయిదా



విశాఖ పోర్టు స్టేడియం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సాక్షి, విశాఖపట్నం: జనసేన శ్రేణులు రాష్ట్ర మంత్రులపై దాడులకు తెగబడటంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. శనివారం సాయంత్రం విశాఖ వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిరసన సెగల్లో చిక్కుకున్నారు. నోవాటెల్ హోటల్‌లో బస చేసిన ఆయన ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పోర్టు కళావాణి ఆడిటోరియంలో జనవాణి కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. పవన్ కల్యాణ్.. వికేంద్రీకరణ, విశాఖ పరిపాలనా రాజధానిగా వ్యతిరేకిస్తుండడమే కాదు.. విశాఖ గర్జన కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్తున్న మంత్రులు, వారి వాహనాలపై జనసేన నాయకులు దాడులు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఉదయం తొమ్మిది గంటలకే పోర్టు స్టేడియం ప్రధాన గేటు వద్ద తరలి వచ్చారు. 'ఉత్తరాంధ్ర ద్రోహి పవన్.. గో బ్యాక్.. డౌన్‌డౌన్ పవన్ కల్యాణ్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. విశాఖ పరిపాలన రాజధానికి అనుకూలమా? వ్యతిరేకమా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పవన్ ముఖచిత్రం ఉన్న ప్లకార్డులను మహిళలు చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. పవన్ వస్తే స్టేడియం లోపలకు వెళ్లనీయబోమని భీష్మించారు. వీరిని పోలీసులు ఎంతగా వారించినా వెనక్కి తగ్గలేదు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అతికష్టమ్మీద పోలీసులు వారిని వాహనాల్లో తరలించారు. కాసేపటికి కేకే రాజు కూడా అక్కడకు చేరుకోవడంతో మరింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. గేటు ముందు బైఠాయించిన ఆయనను అక్కడ నుంచి పంపించడానికి విఫలయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులతోను, జనసేన నాయకులతోనూ వాగ్వాదానికి దిగారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జాతీయ రహదారిపై కొంతసేపు బైఠాయించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఇలా మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీరు అక్కడ ఆందోళనలను కొనసాగించారు.

మంత్రులపై దాడులకు పాల్పడిన జనసేన నాయకులు, కార్యకర్తలను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచేందుకు తరలించారు. మరోపక్క మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌లు నాన్ పొలిటికల్ జేఏసీ నిర్వహించిన మీడియా సమావేశాల్లో జనసేన శ్రేణులు, పవన్ కల్యాణ్ వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు.

జనవాణి వాయిదా..

విశాఖలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించతలపెట్టిన జనవాణి కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు నోవాటెల్ హోటల్‌లో ఉన్న పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఆ సమాచారం తెలుసుకున్న ఆ పార్టీ శ్రేణులు ఒక్కొక్కరుగా ఇంటిముఖం పట్టారు.



కేకే రాజును అరెస్టు చేస్తున్న పోలీసులు



వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



వైఎస్సార్ సీపీ యువజన విభాగ నాయకుడు అళ్ల శివగణేష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు



విశాఖ పోర్టు టౌన్ పోలీస్ స్టేషన్ సిగ్నల్ వద్ద మానవహారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అప్పన్నకు స్వర్ణపుష్పార్చన



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీత సమర్పణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభానమానీయంగా అలంకరించి ఆలయ కల్యాణమండపరో వేదికపై వేంజేంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళిని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు పెదరాజు, టి.పి.రాజీవ్‌లోచన్ ఈపూజని నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేంపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ రాజు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీదేవి, శ్రీదేవివర్మ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

రోప్‌వే బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీ ప్రాంతాన్ని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. రంపచోడవరం –బందమామిడి మధ్య కాలువపై రూ.40లక్షల వ్యయంతో రోప్‌వే బ్రిడ్జి నిర్మాణం కోసం ఐటీడీఏ ఇంజినీర్లు అంచనాలు తయారు చేశారని తెలిపారు. త్వరలో రోప్ వే బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఏజెన్సీలో కొండకాలువ వల్ల రవాణా పరంగా ఇబ్బంది పడుతున్న గ్రామాలను ఇప్పటికే గుర్తించామని, ప్రాధాన్యత క్రమంలో వాటిపై వంతెనల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. గోకవరం –ఇందుకూరుపేట, పోతవరం మధ్య ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణం జరగలేదని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధప్రతిపాదిక రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రంపచోడవరం నియోజవర్గంలో గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం ద్వారా కొండపోడు పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రంపచోడవరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వంద పడకల కోసం అదనంగా భవన నిర్మాణ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు.మన్యాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.దీనిలో భాగంగా మారేడుమిల్లి,సీతపల్లి బ్రిడ్జి వద్ద పర్యాటకుల కోసం అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోని మారేడుమిల్లి–గుర్తేడు రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. చాలా వరకు రోడ్డు పూర్తయిందన్నారు.

ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సూర్యప్రతాప్

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ)గా ఎ.వి.వి.సూర్యప్రతాప్ ఆదివారం గురుద్వారాలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సంస్థ సీఎండీ కె.సంతోషరావు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పీడీ సూర్యప్రతాప్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, సీఎండీ సంతోషరావు, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకం తొలి దశలో తమ సంస్థ పరిధిలోని మొత్తం 4,642 లేఅవుట్లలో 4,72,124 ప్లాట్లకు రూ.1,199 కోట్లతో విద్యుద్దీకరణకు చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్–జగనన్న కాలనీల్లో సమగ్ర మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా గృహాల కోసం వీధిలైట్లు, వాటర్ వర్క్స్‌కు విద్యుత్ రంగం పనితీరు మెరుగుపరిచేందుకు ఆర్.డి.ఎస్.ఎస్. పథకం మొదటి దశలో రూ.3,568 కోట్లతో చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని చెప్పారు. సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించడంతోపాటు వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా పూర్తి చేస్తానన్నారు. అనంతరం సూర్యప్రతాప్‌ను సంస్థ ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ఆయా సంఘాల సభ్యులు ఘనంగా సత్కరించారు.



పీడీ సూర్యప్రతాప్‌ను అభినందిస్తున్న సీఎండీ సంతోషరావు

జాలువారే మంచులో... మలి జాము సొగసులో..

- ఏజెన్సీ అందాలు తిలకించి పర్యాటకులు ఫిదా
- కిటకిటలాడిన టూరిస్టు స్పాట్‌లు



చీకుధార వద్ద పర్యాటకుల సందడి



జెండాకొండపై మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు/అనంతగిరి: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. కొందరు రాత్రి వేళల్లో ప్రకృతి సోయగాలను తిలకించి మంత్రముగ్ధులవుతుంటే.. మరి కొందరు మంచు అందాలను, సూర్యోదయ రమణీయతను సందర్శించి పరవశులవుతున్నారు. దీంతో పలు పర్యాటక ప్రాంతాల వద్ద రాత్రీపగలు అన్న తేడా లేకుండా సందర్శకుల రద్దీ ఉంటోంది. ఈ ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా నడుపుతున్న విస్టాడోమ్(అద్దాల బోగీలు) కోచ్‌లకు కూడా పర్యాటకుల ఆదరణ పెరిగింది. రోడ్డు మార్గంలో కూడా పర్యాటకులు అధికంగా ఇక్కడికి వస్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం పర్యాటకులతో రద్దీగా మారాయి. మన్య ప్రాంత ప్రజల ఆరాధ్య దేవతలైన పాడేరులోని మోదకొండమ్మతల్లి, బోడకొండమ్మ, దారాలమ్మతల్లి ఆలయాల వద్ద కూడా పర్యాటకులు, భక్తుల రద్దీ నెలకొంది. ఈ ఆలయాలను భవానీ, అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు పలువురు సందర్శించారు. పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండాన్ని కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించారు. అనంతగిరి మండలం డముకు వ్యూపాయింట్ వద్ద పాలసముద్రాన్ని తలపించేలా దర్శనమిచ్చిన మంచు సోయగాలను చూసి పర్యాటకులు ఫిదా అయ్యారు. ఫొటోలు, సెల్ఫీలను తీసుకున్నారు. బొర్రా గుహలను ఆదివారం రెండు వేల మంది సందర్శించగా, రూ.1.68 లక్షలు ఆదాయం వచ్చినట్టు సిబ్బంది తెలిపారు.

సీతమ్మ పర్వతానికి క్యూ...

హుకుంపేట: ఉత్తరాంధ్రాలో అత్యంత ఎత్తైన కొండగా గుర్తింపుపొందిన జెండాకొండ(సీతమ్మపర్వతం) అందాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. అక్కడ కనిపించే పాలసముద్రం లాంటి మంచు అందాలు, అందమైన మేఘాలు, సూర్యోదయం, ప్రకృతి రమణీయతను తిలకించేందుకు ఆదివారం భారీగా తరలివచ్చారు. కొండపైకి ఉన్న థింసా రాళ్ల,తేనెపట్టు గుహలను తిలకించారు. జెండాకొండకు వెళ్లే మార్గంలో గొడుగురాయి,గుడ్డిగుమ్మి, హంండీ తదితర జలపాతాలు పర్యాటకులను ఆకర్షించాయి. కొంతమంది పర్యాటకులు శనివారం రాత్రి కొండపైకి చేరుకుని గుడారాలు ఏర్పాటు చేసుకుని అందాలు ఆస్వాదించారు. మరి కొంతమంది పర్యాటకులు కొండాదిగువనున్న ఓలుబెద్దా గ్రామంలో రాత్రి బసచేసి, వేకువజామునే కొండపైకి కాలినడకన చేరుకుని అందాలు తిలకించారు.

చీకుధార వద్ద ...

రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేఖల వద్ద రక్షిత అటవీప్రాంతంలో గల చీకుధార జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో గల ఈ ప్రాంతానికి అటవీప్రాంతం గుండా మార్గం ఉంది. సుదూర ప్రాంతాల నుంచి మోటారు సైకిళ్లు, వ్యాన్లలో ఈ ప్రాంతానికి పర్యాటకులు చేరుకొని రోజంతా సరదాగా గడిపారు. వెంట తెచ్చుకొన్న ఆహారపదార్థాలతో సహపంక్తి భోజనాలు చేశారు. దాదాపు 35 అడుగుల ఎత్తునుంచి జాలువారే ఈ జలపాతం ఇప్పుడిప్పుడే పాచుర్యంలోకి వస్తోంది. ఇక్కడ ప్రమాదకర స్థలాలు ఏవీ లేకపోవడంతో పిల్లలు పెద్దలు ఈ జలపాతం వద్ద కేరింతలు కొడుతూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.



వంజంగి హిల్స్ మంచు అందాలు వీక్షిస్తున్న పర్యాటకులు

విహారంలో విషాదం

- కారును ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకుల మృతి
- అతివేగమే ప్రమాదానికి కారణం



యువకుల మృతదేహాలు

మారేడుమిల్లి: అతివేగం ఇద్దరి యువకుల ప్రాణాలు బలిగొంది. అంతవరకూ ఉల్లాసంగా గడిపిన వారిలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. విహారయాత్రకు బయలుదేరిన వారు ప్రకృతి అందాలు తిలకించకుండానే మృతి చెందారు. కారును బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషాద సంఘటన మారేడుమిల్లిలో గాలిగోపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గుర్తేడు ఎస్‌ఐ జ్వాలా సాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన రెండు కుటుంబాల్లోని నలుగురు వ్యక్తులు శనివారం భద్రాచలం వెళ్లారు. ఆదివారం దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. రాజమహేంద్రవరం కోటిలింగాల పేటకు చెందిన నలుగురు స్నేహితులు రెండు బైకులపై మారేడుమిల్లికి విహార యాత్రకు బయలుదేరారు. మారేడుమిల్లి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గాలి గోపురం మలుపు వద్ద కర్ణాటక భక్తుల కారును రాజమహేంద్రవరానికి చెందిన యువకులు ప్రయాణిస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ఎగిరిపడింది. బైక్‌పై ప్రయాణిస్తున్న పాలిక ధర్మరాజు (19), పోసి రాజు (33) అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన అటువైపుగా వస్తున్న వాహనదారులు 108 కి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. కారు కుడివైపు భాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మృతుల్లో ధర్మరాజు పదో తరగతి వరకు చదివాడు. తండ్రికి చేదోడుగా కూలి పనిచేస్తున్నాడు. పోసిరాజు ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, కులవృత్తి అయిన వడ్రంగి పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాద స్థలంలో కారు, అవతలవైపు పడిన ఉన్న బైక్

46 కేజీల గంజాయితో 14 మంది అరెస్టు

4 బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



గంజాయి రవాణా నిందితులతో సీఐ రాంబాబు, ఎస్‌ఐ సంతోష్‌కుమార్



గంజాయితో నిందితులు

వై.రామవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, చామగడ్డ పంచాయతీ, బండిగడ్డ గ్రామ సమీప కొండవాగు వద్ద ఆదివారం వై.రామవరం పోలీసులకు రూ.80 వేలు విలువచేసే 40 కేజీల గంజాయి అక్రమ రవాణా చేస్తూ, 12 మంది నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 4 మోటారు బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ వై.రాంబాబు తెలియజేసిన వివరాలివి. మండల సరిహద్దు ప్రాంతం నుంచి వై.రామవరం మండలం మీదుగా గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న స్థానిక ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సమాచారం మేరకు సీఐ రాంబాబు ఆధ్వర్యంలో దాడి చేయగా నిందితులు గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో నలుగురు అటవీశాఖ బేస్‌క్యాంప్ సిబ్బంది కూడా ఉన్నట్టు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితులు మండలంలోని యర్రంరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కారం లక్ష్మయ్యదొర, పనసలపాలెం గ్రామానికి చెందిన సల్వేది అబ్బాయి, చింతకర్రపాలెం గ్రామానికి చెందిన బాకూరి విశ్వనాథం, అడ్డతీగల మండలం అచ్చియ్యపేట గ్రామానికి చెందిన కన్నోజి రాజబాబు, మండలంలోని బండిగడ్డ గ్రామానికి చెందిన పల్లాల రవీంద్రరెడ్డి, జంగాలతోట గ్రామానికి చెందిన జర్త వెంకటరమణ, బండిగడ్డ గ్రామానికి చెందిన నైని కృష్ణారెడ్డి, దబ్బామామిడి గ్రామానికి చెందిన కయ్యం వెంకటేశ్వర్లు, ఏలేశ్వరం గ్రామానికి చెందిన బిక్కివిల్లి వీరబాబు, హైదరాబాదుకు చెందిన పాలబిందెల నరసింగరావు, మండలంలోని దబ్బామామిడి గ్రామానికి చెందిన కడబాల సురేష్‌లను ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. వీరిని సోమవారం కోర్టుకు హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. అలాగే గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారికైన కఠిన చర్యలు తప్పవని సీఐ విలేకర్ల సమావేశంలో హెచ్చరించారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

అగనంపూడి(గాజువాక): గంజాయితో ఇద్దరిని ఆదివారం గాజువాక సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆరు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. అగనంపూడి దిబ్బపాలెంలో నివాసముంటున్న బొమ్మిడి రాజు చింతపల్లి నుంచి గంజాయి తీసుకొచ్చి.. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి స్థానికంగా విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు దాడి చేసిన అధికారులు అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గొచ్చుపల్లికి చెందిన గెమ్మెల కామేశ్వరరావు దగ్గర గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడని సెబ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు కామేశ్వరరావును అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రులపై దాడి చేయడం సరికాదు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: మంత్రులపై దాడి చేయడం సరికాదని వైస్ ఎంపీపీ కిల్లో రామన్న అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌లు ఆదివారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో శనివారం జరిగిన విశాఖ గర్జనకు విచ్చేసిన మంత్రులపై మూకుమ్మడిగా జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తూ మంత్రులపై జనసేన కార్యకర్తలు దాడి చేయడం ఉత్తరాంధ్ర ప్రజలపై దాడి చేయడమేనన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి లక్ష్యంతో విశాఖను రాజధానిగా చేయాలనే ప్రభుత్వ యోచనకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక జనసేక దాడులకు పాల్పడడం దుర్గార్మపు చర్య అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్(శ్రీను), ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, నాయకులు రఘునాథ్, సింహాచలం, అర్జున్ రామ్మూర్తి, నాయక్, మల్లేష్, గురు, బాబూరావు, రాజ్‌కుమార్, పూర్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



ఎ.ముకేష్ (ఫైల్)

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంకు చెందిన ఎ. ముకేష్(15) అనే బాలుడు అదృశ్యమయ్యాడని సీఐ ఉపేంద్ర తెలిపారు. హరిపాలెం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ బాలుడు పచ్చ రంగు టీ-షర్ట్ ధరించి ఉన్నాడని, ఈ నెల 13న ఉదయం 11 గంటలకు ఇంటి వద్ద బయలు దేరిన ముకేష్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



నాగేంద్రబాబు(ఫైల్)

చింతపల్లి: ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కె.జి.హెచ్‌లో చికిత్స పొందుతున్న సరమండ నాగేంద్రబాబు(28) ఆదివారం మృతి చెందాడు. లోతుగెడ్డ గ్రామానికి చెందిన నాగేంద్రబాబు గతంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇటీవల బందబయలు మలుపు వద్ద ద్విచక్రవాహన ప్రమాదానికి గురయ్యాడు. కాగా మృతునికి భార్య, ఏడాది వయసు కలిగిన పాప ఉన్నారు. చలాకీగా ఉండే నాగేంద్రబాబు మృతితో లోతుగడ్డ గ్రామంలో విషాదం నెలకొంది.

రేగుపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

యలమంచిలి: ఆదివారం తెల్లవారు జామున రేగుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై విశాఖ నుంచి తునివైపు వెళ్తున్న ఒక ప్రయివేటు ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొంతమందికి స్వల్ప గాయాలయినట్టు రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదూ అందలేదని ఆదివారం స్థానిక విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ప్రసాద్‌కు రజతం

చోడవరం రూరల్: మండలంలోని రాయపురాజుపేటకు చెందిన కె.వి.వి.ఎస్.పి.ప్రసాద్ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాన్ని సాధించాడు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని విదర్భ జిల్లా చంద్రాపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అతడు 66 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. ఇందులో స్కాట్‌లో 207.5 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో వంద కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 255 కేజీలు మొత్తం 562.5 కేజీలు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

దిగుబడి బాగు.. అమ్మకాలు జోరు



వేరుశనగ పంటను ఇంటికి తీసుకొస్తున్న గిరిజన మహిళలు

- ఆర్థికంగా ఆదుకున్న వేరుశనగ పంట
- వారపు సంతల్లో జోరుగా అమ్మకాలు

ముంచంగిపుట్టు: గిరిజనులకు వేరుశనగ పంట లాభాలను కురిపిస్తోంది. ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది వేరుశనగ పంట దిగుబడి రావడం, గిరిజనులకు ఈ ఏడాది గిరిజన రైతులను ఆదుకున్నట్టు అయింది. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 350 ఎకరాల్లో గిరిజనులు వేరుశనగ పంటను వేశారు. ఈ ఏడాది ప్రభుత్వం అందించిన రైతు భరోసాతో ఆర్థిక చేయూతతో రైతులకు కలిసొచ్చింది. దీనికి తోడు వాతావరణం కూడా అనుకూలించింది. ప్రస్తుతం గిరి గ్రామాల్లో గిరిజనులు వేరుశనగ పంటను సేకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. పంట నుంచి సేకరించిన వేరుశనగను శుభ్రపరిచి ఎండలో ఎండ బెడుతున్నారు. కొంత మంది వేరుశనగను ఉడకబెట్టి వారపు సంతలకు తీసుకెళ్లి గ్లాసు రూ.20 నుంచి రూ.50 వరకు గిరి రైతులు విక్రయిస్తున్నారు. దీంతో పాటు పచ్చి వేరుశనగ సైతం బస్తాల లెక్క అమ్మకాలు చేస్తున్నారు. మైదాన ప్రాంతంతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగను లారీలు, వ్యానులలో తరలిస్తున్నారు. గతంలో బస్తా రూ.300 ఉండేది.. ప్రస్తుతం రూ.500లకు పైగా ధర పలుకుతోంది. దీంతో మంచి ధర వస్తోంది రైతులు చెబుతున్నారు. గత నెల రోజులుగా వేరుశనగ అమ్మకాలు ముంచంగిపుట్టు, లక్ష్మీపురం, జోలాపుట్టు, బూసిపుట్టు, బంగారుమెట్ట వారపు సంతల్లో జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాదిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి వేరుశనగ ఆదుకోవడంతో పాటు లాభాలు సైతం తీసుకోచ్చిందని వేరుశనగ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి ముందు ఎండబెట్టిన వేరుశనగ

ఆశాజనకంగా ధరలు

ఈ ఏడాది ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న మాకు వేరుశెనగ పంట ఆదుకొంది. దిగుబడితో పాటు మంచి ధర పలకడం ఆర్థికంగా కలిసొచ్చింది. ప్రభుత్వం అందించిన రైతు భరోసాతో పెట్టుబడి పెట్టాం. పంటతో పాటు లాభాలు భాగా వచ్చాయి. ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సంతకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నాం.

– వి.సుబ్బారావు, గిరిజన రైతు, తాల్లబుతోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

సాగుపై అవగాహన

రైతులకు ఆర్థికంగా ఎదిగే పంటలపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పిస్తున్నాం. వేరుశనగ పంటను వేస్తున్న రైతులకు దిగుబడిపై పలు సూచనలు చేస్తే దానికి అనుగుణంగా పంటలు వేశారు. దిగుబడితో పాటు ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు. రైతు భరోసా సొమ్ము సైతం రైతులకు బాగా ఉపయోగపడింది.

–మోహన్‌రావు, మండల వ్యవసాయ శాఖాధికారి, ముంచంగిపుట్టు

టీడీపీ కనుమరుగు కావడం ఖాయం



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: ఏజెన్సీలో రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పోయిపల్లి గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నుంచి ముఖ్యనేతలతో 58 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో పోయిపల్లి పంచాయతీ పోయిపల్లి, సల్లంగిపుట్టు, గన్నేలిపుట్టు, సాకిరేవు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు చేరారు. వారందరికి ఆయన పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, జగనన్న సంక్షేమ పాలన చూసి పార్టీలో చేరామని, వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా మారిందన్నారు. మన్యంలో రానున్న రోజుల్లో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొరికిన సీసీ కెమెరాలు

కాలేజీ ఆవరణలోని తుప్పల్లో ప్రత్యక్షం



తలుపు తెరుస్తూ సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

రావికమతం: కొత్తకోట జూనియర్ కాలేజీలో గత నెల 6న చోరీకి గురైన సీసీ కెమెరాలు ఆదివారం కాలేజీ ఆవరణలోని తుప్పల్లో దర్శనమిచ్చాయి. కాలేజీ చుట్టూ పిచ్చితుప్పలు పెరిగిపోవడంతో ప్రిన్సిపాల్ సాయికుమార్ వాటిని తొలగింప చేస్తుండగా కెమెరాలు, వాటి పరికరాలు కన్పించాయి. సెప్టెంబరు 6న కాలేజీలో చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాలు, వాటి పరికరాలతో పాటు, టీవీ ఎత్తుకెళ్లారు. కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పిచ్చితుప్పల్ని తొలగిస్తుండగా కెమెరాలు కన్పించడంతో అవి పనిచేస్తున్నాయో లేదోనని పరిశీలించగా చోరీకి వచ్చిన గెడ్డాలు పెంచుకున్న ఒక యువకుడు ప్రిన్సిపాల్ రూం తలుపు తెరుచుకుని రావడం, ఆ వెంటనే కెమెరాకి చిక్కానని భావించి వెనక్కి వెళ్లి షర్ట్‌విప్పి ఆ కెమెరాకు కప్పి ఆపై చోరీకి పాల్పడినట్టు రికార్డ్ అయ్యింది. ప్రిన్సిపాల్ ఆ సమాచారాన్ని కొత్తకోట ఎస్‌ఐకు తెలియజేయడంతో కేసును ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చీకుధార పరిసరాల్లో గ్రామస్తుల శ్రమదానం



చీకుధార జలపాతం వద్ద శ్రమదానం చేస్తున్న అమ్మిరేఖల గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని ప్రముఖపర్యాటక ప్రదేశం చీకుధార జలప్రాంతానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలు, చెత్త చెదారంతో నిండి ఉండడంతో గ్రామస్తులు ఆదివారం శ్రమదానం చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇక్కడికి వస్తున్న పర్యాటకులు వాటల్‌బాటిళ్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతరత్రా వ్యర్థాలను ఈ ప్రాంతంలో విచక్షణారహితంగా వెదజల్లుతున్నారన్నారు. ఈ కారణంగా పర్యాటక ప్రాంతం పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయన్నారు. పర్యాటక ప్రాంతంతో పాటు పుణ్యక్షేత్రంగా పేరొందిన ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుని మృతి కేసును పరిశీలించిన జిల్లా ఎస్పీ



మునగపాకలో సంఘటన స్థలానికి వెళుతున్న జిల్లా ఎస్పీ గౌతమిసాలి

మునగపాక: మునగపాకలో మూడు రోజుల క్రితం జరిగిన అనుమానాస్పద మృతికి సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమిసాలి పలు వివరాలు సేకరించారు. ఈ నెల 12న నాగులాపల్లికి చెందిన యల్లపు గంగమహాలక్ష్మినాయుడు తన అత్తారింటికని చెప్పి వెళ్లి అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై జరుగుతున్న దర్యాప్తును పరిశీలించడానికి వచ్చిన ఎస్పీ సంఘటనా స్థలంతో పాటు నాగులాపల్లిలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. మృతుడు గంగ మహాలక్ష్మినాయుడు బైక్‌ను పార్క్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె కేసు విచారణ అధికారులైన అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, యలమంచిలి సీఐ గఫూర్, ఎస్‌ఐ భీమరాజులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. అనుమానితులను గుర్తించి వారి నుంచి మరిన్ని వివరాలు సేకరించాలన్నారు. విచారణ పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

గాలిస్తున్న పోలీసులు



విద్యార్థి మనోజ్ సాక్షి




విద్యార్థి హార్షవర్ధన్

నర్సీపట్నం: నర్సీపట్నం టౌన్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. పట్టణ సీఐ ఎన్.గణేష్ తెలిపిన వివరాలు..నర్సీపట్నం పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతానికి చెందిన సింహాద్రి మనోజ్ సాక్షి(15), నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి గ్రామానికి చెందిన బంటు హర్షవర్ధన్(15) ఇద్దరూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. ఈ 15వ తేదీ నుంచి తమ పిల్లలు ఇంటికి రాలేదని ఆయా పిల్లల తండ్రులు ఎలీషారాజు, అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ నెల 15న స్కూల్ వెళ్లిన విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్లోనే ఉన్నారు. సాయంత్రం స్కూల్ ముగియగానే మనోజ్ ఇంటికి వెళ్ళి బట్టలు సర్దుకుని వచ్చేశాడు. పోలీసులు అప్రమత్తమై సినిమా థియేటర్లు, నర్సీపట్నంలోని కొన్ని ప్రాంతాలను గాలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇద్దరు విద్యార్థులు బస్సు ఎక్కడాన్ని సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించిన పోలీసులు తుని, అనకాపల్లి పోలీసులను సైతం అప్రమత్తం చేశారు. మనోజ్ సాక్షి అనే విద్యార్థి గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగివచ్చాడని సీఐ తెలిపారు. విద్యార్థుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

గుంటూరు లక్ష్మణరావుకు జాతీయ పురస్కారాలు

రావికమతం: మండలంలోని టి.అర్జాపురంలో వినాయక ఆలయ అర్చకుడు గుంటూరు లక్ష్మణరావుకు కవి విశారద, చిమ్నీమిత్ర అనే రెండు జాతీయ పురస్కారాలు లభించాయి. పలు రచనలతో సామాజిక చైతన్యం చేస్తున్న ఆయనకు హరివిల్లు–కవి విశారద జాతీయ పురస్కారాన్ని ఆన్‌లైన్ వేదికగా భద్రాద్రి సాహితీ వేదిక కొత్తగూడెం వ్యవస్థాపక అధ్యక్షుడు వీటీఆర్ మోహనరావు, హరివిల్లు రూపకర్త మామిడి రమేష్, అధ్యక్షుడు సీర హరిప్రసాద్ ఆదివారం అందించారు. హరివిల్లు మాత్రా ఛందస్సుతో కూడిన 800 కవితలు రాసిన వారికి ఈ పురస్కారం ఇస్తున్నారు. చిమ్నీమిత్ర జాతీయ పురస్కారం చిమ్నీలు సమూహ రూపకర్త జాదవ్ పుండలిక్ ఆన్‌లైన్ వేదికగా అందించారు. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన హంస వాహినీ సాహిత్య కళా పీఠం వారు మాత్రా చందస్సుతో కూడిన 600 చిమ్నీ కవితలు రాసిన వారికి ఈ పురస్కారం ఇస్తారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును పలువురు అభినందించారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



ఆసుపత్రిలో మృతిచెందిన కండక్టర్ సింహాచలం

కె.కోటపాడు: మర్రివలస నైట్‌హాల్ట్ ఏపీఎస్ ఆర్టీసీ కండక్టర్ ఎ.సింహాచలం ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మర్రివలస గ్రామం నుంచి తెల్లవారుజామున మూడు గంటలకు బయలు దేరేందుకు కండక్టర్ సింహాచలం బ్రష్ చేస్తున్నాడు. అదే సమయంలో సింహాచలం ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని కె.కోటపాడు సీహెచ్‌సీకి డ్రైవర్ సన్యాసిరావు, స్థానికులు తీసుకువెళ్లారు. అయితే ఆస్పత్రికి వెళ్లే సమయానికి సింహాచలం మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వాల్తేరు డిపోలో పని చేస్తున్న సింహాచలానికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొడుకు మందలించాడని తండ్రి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: కొడుకు మందలించాడని తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన గవరపాలెంలో ఆదివారం జరిగింది. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు గవరపాలెం అంబేద్కర్‌నగర్‌కు చెందిన యర్రా సన్యాసిరావు (50) కొంత కాలంగా క్షయతో బాధపడుతున్నాడు. రోడ్లపై తిరుగుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నావని కొడుకు తండ్రిని మందలించడంతో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని తండ్రి సన్యాసిరావు మృతి చెందాడు.

క్లుప్తంగా

ప్రతీ ఒక్కరూ అక్షరాస్యులు కావాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

గూడెంకొత్తవీధి: ప్రతీ ఒక్కరూ అక్షరాస్యులు కావాలన్న లక్ష్యంతో అమలుచేస్తున్న అక్షరజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు అన్నారు. పెదవలసలో ఆదివారం అక్షరజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ వయోజనులతో పాటు అందరూ అక్షరాలు నేర్చి చదవడం, రాయడం నేర్చుకోవాలని సూచించారు. చదువు ప్రాముఖ్యతను వివరించారు. దీనిలో అక్షరజ్యోతి కో–ఆర్డినేటర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

ఎంపీటీసీ మాజీ సభ్యురాలి మృతికి సంతాపం



నాగులమ్మ(ఫైల్)

జి.మాడుగుల: గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మత్స్యరాస వరహాలరాజు తల్లి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మత్స్యరాస నాగులమ్మ(103) ఆదివారం వృద్ధాప్యంతో స్వగృహంలో మృతి చెందారు. నాగులమ్మ మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.

క్లాప్‌మిత్రకు ఆర్థికసాయం



క్లాప్‌మిత్రకు ఆర్థిక సాయం చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి

దుంబ్రిగుడ: కొరాయి పంచాయతీకి చెందిన తెడబారికి కామరాజు గత 14 ఏళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా సేవలను అందిస్తున్నారు. ఆరునెలల క్రితం జరిగిన ప్రమాదంలోని కామరాజు ఇంటికే పరిమితం కావడంతో ఆయనను, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరీ ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకులను అందజేశారు. అనంతరం శోభ సోమేశ్వరీ మాట్లాడుతూ కామరాజు కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లీలరాణి, నరేష్, వలంటీర్ విజయనిర్మల తదితరులున్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాజేశ్వరి

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ ఆస్పత్రిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. మిషన్ కార్యదర్శి స్వామి వినిష్పలానందజీ మహరాజ్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం సిరిగిందలపాడు ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్టు చెప్పారు.శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి రక్తపరీక్షలు చేశామని, ఉచితంగా మందులు అందజేశామన్నారు. వైద్యులు జి.భాస్కర్, తీడా రాజేశ్వరి, సంపత్‌కుమార్‌లు వైద్య సేవలందించారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

దుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా డిగ్రీ పూర్తి చేసుకున్న పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డిప్యూటి తహసీల్దార్ షేక్ ముజీబ్ చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరు నమోదు చేసుకునే అభ్యర్థులకు ఫారం–18 తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని, దానికి ఓటరు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ , ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలను జత చేసి సిబ్బందికి అందజేయాలని కోరారు. 2018 అక్టోబర్ 30 లోగా డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులుగా చెప్పారు.నవంబర్ 7వ తేదీ వరకు గడువు ఉందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘాట్‌రోడ్డు ప్రయాణం.. జర భద్రం

- ప్రమాదకర మలుపులు
- శిథిలమైన రక్షణ గోడలు

అనంతగిరి: మన్యంలోని ఘాట్‌రోడ్డు ప్రయాణం అంటే ఆహ్లాదం.. రహదారికి ఇరువైపులా దట్టమైన చెట్లు.. కొండను తాకుతున్న మేఘాలు..చల్లని గాలులు.. కొండ కిందన దర్శనమిస్తున్న పచ్చని పొలాలు.. ప్రకృతి నడుమ ఆహ్లాద ప్రయాణం వర్ణనాతీతం. అయితే అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రయాణం ఆహ్లాదం చెంతన ప్రమాదం పొంచి ఉంది.. కూలిన రక్షణ గోడలు.. గోతుల రహదారితో దర్శనమిస్తోంది.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఘాట్‌రోడ్డు మరింతా అధ్వానంగా మారింది. మన్యంలోని సందర్శక ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు నిరంతరం వేలాది సంఖ్యలో ఘాట్‌రోడ్డు ప్రయాణం ద్వారా తరలివస్తుంటారు. పచ్చని చెట్ల మధ్య గుండా ఉన్న రహదారిలో ప్రయాణం చేస్తూ, అందాలను ఆస్వాదిస్తుంటారు. గతంలోని ఈ రహదారి ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండేది. సుమారు రెండేళ్ల క్రితం జాతీయ రహదారుల సంస్థ పరిధిలోకి ఈ రహదారిని మార్పు చేశారు. అప్పటి నుంచి నిర్వహణ లేకపోవడంతో ఘాట్‌రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. తరచూ ప్రమాదాలకు వాహనచోదకులు గురవుతున్నారు.



ఘాట్‌రోడ్డులో కూలిన రక్షణగోడ

రక్షణలేని రక్షణగోడలు .. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలతో పాటుగా గత రెండేళ్లుగా ఘాట్‌రోడ్డులోని నిర్వహణ లేకపోవడంతో రహదారి అధ్వానంగా మారింది. రక్షణ గోడలు ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్నిచోట్ల వాహనాలు ఢీకొనడంతో రక్షణగోడలు పడిపోయి, ప్రమాదకరంగా మారాయి. రహదారిని ఆనుకుని ఉన్న భారీ చెట్లు, తొలగించకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయం భయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాలకు కొండచరియలు జారిపడి రహదారి మీదుకు వస్తున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపై పారుతూ రాళ్లు, మట్టిచేరి, వాహనచోదకులు జారిపడి గాయాలవుతున్నారు. ఇటీవల భారీ వర్షాలకు రహదారి అంచులు కోతకు గురై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలోని వాహనాలు గోతుల్లో దిగుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద వాహనాలు అయితే రెండు మూడు రోజులు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయంగా ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదకర మలుపులు.. కానరాని రక్షణ చర్యలు

ఘాట్‌రోడ్డులో చిలకలగెడ్డ నుంచి అరకు వరకు 8 ప్రమాదకరమైన హెయిర్‌పిన్‌బెండ్ మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలోని ప్రమాదాలు జరిగిన రక్షణ గోడలను పునర్నిర్మించకపోవడంతో మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. హెయిర్‌పిన్‌బెండ్–5 మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 2021 ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులతో అరకు నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సు ఈ మలుపు వద్ద లోయలో పడడంతో నలుగురు మృత్యువాతపడగా, 20 మంది వరకు గాయపడ్డారు. హెయిర్‌పిన్‌బెండ్–1 మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు ఈ మలుపు వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. ప్రమాదాలు జరిగిన తరువాత వెనువెంటనే రక్షణగోడలకు రంగులు వేసి, మలుపుల వద్ద రేడియం స్టాండులను ఏర్పాటు చేశారని, అయితే తరువాత ఈ ఘాట్‌రోడ్డుపై నిర్వహణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారిందని వాహనచోదకులు చెబుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు స్పందించి ఘాట్‌రోడ్డులోని రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



హెయిర్‌పిన్‌బెండ్-5 మలుపువద్ద లోయలో పడిన ప్రైవేటు బస్సు (ఫైల్)

ఈ ఘాట్‌రోడ్డు సమస్యను కలెక్టర్‌తో పాటు ఎన్‌హెచ్‌ఐఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో శ్రీహర్షిత్ చెప్పారు. మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు మెర్రర్‌లు ఏర్పాటు విషయాన్ని కూడా ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సీకరి పంచాయతీ బైలువీధి, సీకరి, బంగారుమెట్ట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 278 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా, సకాలంలో పథకాలు అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు, తాగునీరు, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. పాలకుడిలా కాకుండా సేవకుడిలా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కర్రిముఖిపుట్టులో గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సమస్యల పరిష్కారానికి కృషి

హుకుంపేట: చీకుమద్దుల పంచాయతీ కేంద్రంతో పాటు రంగరాజుపల్లి, చిననందిపుట్టు గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రహదారి, తాగునీరు తదితర సమస్యలను తెలియజేశారు. జెడ్పీటీసీ మత్స్యలింగం మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు నైని సత్తిబాబు, సర్పంచ్ వెంకటరావు, వైస్ సర్పంచ్ ఉత్రన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సదాశివరాజు, నాయకులు కామేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, నాయకులు

పోస్టల్ సేవలపై అవగాహన అవసరం

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు నైపుణ్యత రాత పరీక్ష నిర్వహించినట్టు ఐపీవో ఉపేంద్ర చెప్పారు. ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్ స్పర్శ్ యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా పాఠశాలల్లో 6,7,8,9 తరగతులు చదువుతున్న 960 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్నారని, ఈ మేరకు విద్యార్థులకు రాత పరీక్ష జరుగుతుందన్నారు. పోస్టల్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం సుందర్‌రావు, తపాల శాఖ సిబ్బంది తదితరులున్నారు.



పరీక్షను పర్యవేక్షిస్తున్న తపాలా శాఖ అధికారులు

అల్లూరి స్మారక పార్కుల అభివృద్ధి

కొయ్యూరు: మంప, రాజేంద్రపాలెం, చింతపల్లిలో అల్లూరి స్మారక పార్కుల అభివృద్ధికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్షత్రీయ సంఘాలు నిర్ణయించినట్టు సంఘం అధ్యక్షుడు ఎస్.నానిరాజు చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో సంఘం నేతలు రాజ్‌కుమార్, శివరామరాజు, సర్పంచ్ సింహాచలంలు అల్లూరి స్మారక ప్రాంతాలను ఆదివారం సందర్శించారు. రాజ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి స్మారక పార్కుల్లో పగోడాలు, స్టేజీలతో పాటు స్థానికుల సూచనల సూచనల మేరకు పలు చర్యలు చేపడుతామన్నారు.



మంప అల్లూరి పార్కులో క్షత్రీయ సంఘం నేతలు

నేటి నుంచి సదానందస్వామిజీ ఆరాధనోత్సవాలు

అడ్డతీగల: సదానంద స్వామి వారి ఆరాధనోత్సవాలు సోమవారం నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. రాజమహేంద్రవరంలోని కొంతమూరు వద్ద స్వామి వారి ఆశ్రమంలో జరగనున్న ఆరాధనోత్సవాలు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు

కొయ్యూరు: డౌనూరులో సోమవారం జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులంతా పాల్గొవాలని కోరారు.

దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మండలంలో సోమవారం పర్యటించనున్నట్టు పార్టీ వర్గీయులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇందుకూరు గ్రామ సచివాలయ పరిధిలో చినభీంపల్లి, లోతుపాలెం, కొత్తవీధి, చాపరాళ్లపల్లి, ఎం. రావిలంక గ్రామాల్లో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వీవోఏల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం జె.ఆదినారాయణరావు మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికే అందజేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వన్‌ధన్ వికాస్ ద్వారా చింతపండు, పసుపు, కొండ చీపుళ్ల తదితర విక్రయాల సొమ్ముతో పాటు రుణ వసూళ్లను కార్యాలయంలో సకాలంలో జమ చేయాలని సూచించారు.

వన్‌ధన్ వికాస కేంద్రం సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.1000 సభ్యత్వ రుసుం (వాటాధనం) వసూలు చేయాలని ఆదేశించారు. మండలంలో 59 వీఓఏలు ఉండగా, 40 మంది వీఓఏలు మాత్రమే సమావేశానికి హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో రికార్డులు పూర్తి చేయలేని వారు, విధులకు గైర్హాజరవుతున్న వారు విరమించుకొంటే కొత్త వారిని నియమించుకొంటామని హెచ్చరించారు. సీసీలు పూర్ణిమ, గౌరమ్మ, నిర్మల, సూర్యనారాయణ, నానిబాబు, దయేంద్రరావు, సిబ్బంది రాజశేఖర్, అనూష పాల్గొన్నారు.



వీవోఏలకు సూచనలిస్తున్న ఏపీఎం ఆదినారాయణరావు

వనుగురాయిలో పశువైద్య శిబిరం

పెదబయలు: ఇంజరి పంచాయితీ వనుగురాయి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.రాజారవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇటీవల పిడిగుపాటుకు గురై మృతి చెందిన ఆవులు, మేకలకు సంబంధించిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సన్నీబాబు ,దేవరాజు తదితరులున్నారు.

శ్రీనివాసుని కళ్యాణోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజవొమ్మంగి: లాగరాయి గ్రామంలో ఈనెల 22న టీటీడీ ఆధ్వర్యంలో జరుగనున్న శ్రీనివాసుని కళ్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని నిర్వాహకులు ఆదివారం ఆవిష్కరించారు. గంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు జగన్నాథం, విశ్వనాథరెడ్డి, అప్పారావు, సర్పంచ్ గణలక్ష్మి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 9 నుంచి వివిధ కార్యక్రమాలు, 11 నుంచి ఒంటి గంట వరకు స్వామి వారి కళ్యాణ వేడుక జరుగుతుందని, అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

తప్పుడు ఆరోపణలు తగవు



ఎంపీపీ అనూషా దేవి

చింతపల్లి: మన్యంలో మైనింగ్ తవ్వకాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, దీనిపై టీడీపీ నాయకురాలు గిడ్డి ఈశ్వరి ఆరోపణలు చేయడం తగదని ఎంపీపీ కోరాబు అనూషాదేవి స్పష్టం చేశారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మన్యంలో మైనింగ్ తవ్వకాలకు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరు చేసిన విషయం టీడీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికీ తెలియదా అని ప్రశ్నించారు. ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఈకేవైసీ గడువు నేటితో పూర్తి



ఏవో కృష్ణవేణి

కొయ్యూరు: రైతులు ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు సోమవారంతో ముగుస్తుందని ఏవో కృష్ణవేణి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో ఇప్పటివరకు 6992 రైతులకు ఈ–క్రాప్‌లో నమోదు చేశామన్నారు. ఇంకా 960 మంది చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు సుమారు 20వేల ఎకరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేశామని, ఇందులో వరి, అపరాలు, రాజ్‌మా, పసుపుతో పాటు వివిధ పంటలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వరికి తెగుళ్ల సోకే అవకాశముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సచివాలయంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి



ధ్రువీకరణపత్రం తీసుకుంటున్న రమణ

చింతపల్లిరూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపభోక్త అధికార్ సంస్థ వినియోగదారుల హక్కుల సంస్థ కన్వీనర్‌గా దూనబోయిన రమణను నియమించారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు ఆదివారం నియమాక పత్రం అందజేశారు. వినియోగదారుల హక్కులను పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని రమణ తెలిపారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి



ఏవో మదుసూధన్

గూడెంకొత్తవీధి: రైతు భరోసా, పీఎం కిసాన్ నిధి రెండో విడతగా నగదు రైతులు ఖాతాల్లోకి సోమవారం జమ అవుతుందని ఏవో మదుసూధన్ ఆదివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో పట్టాలు కలిగిన 4,840 మందికి, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన 5,612 మంది రైతులకు కలిపి మొత్తం10,452 మంది రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈ విషయాన్ని గమనించి రైతులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. పాడేరులో ఈ సందర్భంగా సమావేశం నిర్వహిస్తున్నారన్నారు.

గృహ లబ్ధిదారులకు నేటి నుంచి అవగాహన సదస్సులు

రాజవొమ్మంగి: శాశ్వత గృహ నిర్మాణ లబ్ధిదారులకు సోమవారం నుంచి మండలంలోని ఆయా పంచాయతీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు హౌసింగ్ ఏఈ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు.రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా ఏపీ గృహ నిర్మాణ సంస్థ ద్వారా 229 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరైనట్టు తెలిపారు. ఈ మేరకు గృహ నిర్మాణల కోసం సూచనలు, సాంకేతిక పరమైన సలహాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో–ఆప్షన్ సభ్యుడు, సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు హాజరుకానున్నట్టు తెలిపారు. 17న లోదొడ్డి, వాతంగి, చికిలింత, వంచంగి, మారేడుబాక పంచాయతీలో, 18న దూసరపాము, తంటికొండ, జడ్డంగి, అమీనాబాద్, గడువోకుర్తి, చెరకుంపాలెం, 20న లబ్బుర్తి, లాగరాయి, కింద్ర, కిర్రాబు, కొండపల్లి, శరభవరం, బడదనాంపల్లి సచివాలయాల్లో, 21న రాజవొమ్మంగి సచివాలయంలో జరగనున్న అవగాహన సదస్సులకు లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సమావేశాలను గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

అడ్డతీగల: మెరుగైన విద్యాబోధన పద్ధతుల అమలుపై సోమవారం నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈవో వై.మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 3,4,5 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రధానంగా ఇంగ్లిషు, గణితం,సైన్సు సబ్జెక్టుల బోధనపై మెలకువలను ఉపాధ్యాయులకు తెలియజేస్తామన్నారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్‌లుగా నియమించి, ఆయా సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఏర్పాటుచేశామన్నారు. మండలంలో ఉన్న 85 మంది ఉపాధ్యాయులకు రెండు బ్యాచ్‌లుగా విభజించి రెండు విడతల్లో శిక్షణ ఇస్తామన్నారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు: ప్రయాణికుల ఇక్కట్లు

రాజవొమ్మంగి: రేవళ్ల నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సిన ఏలేశ్వరం డిపోకు చెందిన పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు సూరంపాలెం గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం నిలిచిపోయింది. ఇంజన్‌లో తలెత్తిన లోపం కారణంగా బస్సు మొరాయించినట్టు డ్రైవర్ చెప్పారు. కాగా ఈ రూట్‌లో గత రెండు వారాల్లో ఈ విధంగా వివిధ కారణాలతో నాలుగు బస్సులు ఆగిపోవడం గమనార్హం. ఇకనైనా ఏజెన్సీ ప్రాంతానికి కండీషన్‌లో ఉన్న బస్సులు కల్పించాలని, రహదారులు మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు వారపు సంత

అనంతగిరి: సంతబయలు వద్ద సోమవారం వారపు సంత జరుగుతుంది. లక్ష్మీపురం, రేగం, పాతకోట, డెక్కాపురం, తేనెపుట్టు, తలారీపాడు గ్రామాల నుంచి గిరిజనులు తీసుకొచ్చిన పసుపు, తేనె, కొండ చీపుళ్లతో పాటు టమాటా, క్యాబేజీ కూరగాయల విక్రయాలు జరుగుతాయి.

సచివాలయం మండల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మారేడుమిల్లి: సచివాలయం మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా డి.లచ్చన్న దొర, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, సెక్రటరీగా డి.జెమ్స్, వైస్ సెక్రటరీగా పి.శ్వేత, ట్రెజరర్‌గా ప్రసాద్ రెడ్డి, మీడియా కన్వీనర్‌గా దుర్గా ప్రసాద్ ఎన్నికైయ్యారు. ఎన్నికలకు పర్యవేక్షకులుగా జిల్లా జాయింట్ సెక్రటరీ సురేష్ రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.

ఇందుకూరుపేటలో అన్న సమారాధన



సువర్ణగిరిపై అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దేవీపట్నం: ఇందుకూరుపేటలో సువర్ణగిరి సాయిబాబా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. షిర్డీ సాయిబాబా దివ్య మహా సమాధి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రహదారులు జలమయం

అనంతగిరి: మండలంలోని ఆదివారం సాయింత్రం నుంచి భారీ వర్షం కురుస్తుంది. గత మూడు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టగా, ఆదివారం సాయంత్రం మళ్లీ భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి.

గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భీసుపురం గ్రామ సమీపంలోని అరకు–విశాఖ ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.